రాష్ట్ర స్థాయి పోటీలకు గోవాడ విద్యార్థులు

విశాలాంధ్ర-చోడవరం: చోడవరం మండలం గోవాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు 10 మంది రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్.ఎం. కె.రాము శనివారం మీడియాకు తెలియజేసారు. ఈ నెల 15 న ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి ఫెన్సింగ్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు తమ పాఠశాల ఆవరణలో నిర్వహించామన్నారు. తమ పాఠశాలకు విద్యార్థులు కర్నూలు లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులను అభినందించిన వారిలో వ్యాయామ ఉపాధ్యాయుడు గండి భాస్కర్, గంగునాయుడు, ఎస్.ఎం.సి. ఛైర్మన్ గణపతమ్మ, మాజీ సర్పంచ్ యేడువాక లక్ష్మణ్ కుమార్, ఎస్.ఎం.సి. మాజీ ఛైర్మన్ యేడువాక సత్యారావు తదితరులు వున్నారు.

అడ్డు త్రోవల్లో గంజాయి రవాణా

పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ శాఖలు

ఇటీవల గంజాయిని పట్టుకున్న కే కోటపాడు పోలీసులు (ఫైల్ ఫోటో)

విశాలాంధ్ర-కే కోటపాడు: ఒకపక్క నాటు సారా ! మరోపక్క విస్తృతమైన గంజాయి రవాణా ... యదేచ్ఛగా తరలిపోతున్నా పట్టించుకున్న నాథుడేలేడు. పోలీస్ వాహన తనిఖీల్లో పట్టుబడితే ఒకటి అరా కేసులు తప్ప మిగిలిన సమయాల్లో దర్జాగా నాటుసారా గంజాయి రవాణా అవుతూనే ఉన్నాయి. ప్రభుత్వం గంజాయి పై ఉక్కు పాదం మోపుతున్నామని ప్రకటనలే తప్ప సీరియస్ గా అదుపు చేయలేకపోతున్నారు. మన్యం నుంచి మాడుగుల నియోజకవర్గంలోని 4 మండలాల మీదుగా గంజాయి రవాణా జరుగుతుంది. నాటు సారా గంజాయి రవాణాలను సమర్థంగా అరికట్టేందుకు కే కోటపాడు లో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. చీడికాడ మండలం బైలుపూడి నుండి కే కోటపాడు మండలం మీదుగా తరలతున్న గంజాయి కె కోటపాడు, ఏ కోడూరు పోలీసుల తనిఖీల్లో తరచూ పట్టుబడుతోంది. గతంలో ఇక్కడ ఎక్సైజ్ స్టేషన్ ఉండేది దాన్ని తొలగించడంతో నాటుసారా గంజాయి రవాణాకు గేట్లు తెలిచినట్లు అయింది. గంజాయిని అనంతగిరి మీదుగా పినకోట, పెదకోట నుండి దేవరపల్లి ఆనందపురం మీదుగా కొత్తవలస రైల్వే స్టేషన్ కు చేరు తుంది. కే కోటపాడు చౌడువాడ మల్లం పాలెం గవరపాలెం పాచిల వానిపాలెం తదితర అడ్డు రోడ్ల ద్వారా అనకాపల్లి రైల్వే స్టేషన్ కు తరలించి అక్కడి నుండి దూర ప్రాంతాలకు పంపుతున్నారు. ఈ రెండు రైల్వే స్టేషన్లలో భద్రత తక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో రైళ్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇదే విషయమై ఎక్సైజ్ సీఐ పాపునాయుడును వివరణ కోరగా ఇప్పటి వరకు కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుపై బిజీగా ఉన్నామని ఇకపై నాటు సారా గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

చెరకు రైతులను ఆదుకోండి

మంత్రి నారా లోకేష్ ను కలిసిన కూటమి నాయకులు

విశాలాంధ్ర-చోడవరం : సహకార రంగంలో అగ్రగామిగా నిలిచి, అన్నింటా అగ్రగామిగా నిలిచిన ది.చోడవరం కో ఆపరేటివ్ (గోవాడ) సుగర్స్ ను, చెరకు రైతులను అన్ని విధాల ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర విద్యా శాఖ, ఐ.టి. శాఖ మంత్రి నారా లోకేష్ ను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబుతో కలసి శనివారం విశాఖ లో కలసి జనసేనాని పి.వి.ఎస్ ఎన్.రాజు వినతి పత్రం అందజేశారు. చెరకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం గ్రాంట్ రూపంలో నిధులు విడుదల చేయాలని కోరారు. కార్మికులకు, కర్షకులకు బకాయిలు పేరుకుపోవడంతో ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని తెలిపారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో సుమారు 200 గ్రామాల్లో 24,500 మంది ఫ్యాక్టరీ సభ్య రైతులు, వెయ్యికు పైగా కార్మికులు కలిసి సుమారు లక్షకు పైగా వ్యవసాయ కుటుంబాలు గోవాడ సుగర్స్ పై ఆధారపడినట్లు తెలియజేసారు. ఫ్యాక్టరీ కార్మిక, కర్షకులకు న్యాయం చేయాలని కోరారు.

ఈవి ఎం గొడౌను తనిఖీ

విశాలాంధ్ర-అనకాపల్లి: జిల్లా ఎస్.పి. కార్యాలయం ప్రాంగణంలో గల ఇ వి ఎం గొడౌను ను డిప్యూటీ చీఫ్ ఎన్నికల అధికారి , రాష్ట్ర ఇ వి ఎం నోడల్ అధికారి కె. విశ్వేశ్వరరావు, జిల్లా కలెక్టరు జిల్లా ఎన్నికల అధికారి విజయ క్రిష్ణన్ తో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీచేసారు. గొడౌను సీళ్లను, సిసి కెమెరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసారు. అగ్నిమాపక పరికరాలను ఇ వి ఎం గొడౌను బయట కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యకమంలో జిల్లా రెవిన్యూ డివిజినల్ అధికారి బి. దయానిధి, రెవిన్యూ డివిజినల్ అధికారి షేక్ ఆయిషా, జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.వెంకటరమణ, అనకాపల్లి తహశీల్దారు, విజయకుమార్, ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి.శ్రీనివాసరావు, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాథబాబు, సిపిఎం ప్రతినిధి అల్లు రాజు, బిజెపి ప్రతినిధి టి.నాగేశ్వరరావు, వైసీపి ప్రతినిధి షణ్ముఖ్, ఐఎన్ సి ప్రతినిధి టి.రమణ పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే సుందరపు

విశాలాంధ్ర-మునగపాక: తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను శనివారం విశాఖపట్నంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మునగపాక మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు కలిశారు. ఈ సందర్భంగా యలమంచిలి నియోజకవర్గంలో మునగపాక మండలం రైతాంగం నల్ల బెల్లం పై ఎక్స్చేంజ్ ఆంక్షలు ఎత్తివేయాలని ప్రధానంగా మునగపాక మండలం వ్యవసాయంపై ఆధారపడి జీవన ఉపాధి పొందుతున్నారని ప్రస్తుతం పంట కాలువల ద్వారా నీరు రాకపోవడం వల్ల గత ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా రైతాంగం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇరిగేషన్ శాఖ ద్వారా కాలువలు తవ్వించి రైతన్నకి పంటలకు నీరు అందేలా ఏర్పాటు చేయాలని మునగపాక మండలంను కరువు మండలంగా ప్రకటించాలని మంత్రి లోకేష్ కు తెలియజేశారు.

దీపావళి కానుకగా మూడు సిలిండర్లు ఉచితం

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో గ్రామాల అభివృద్ధి
- ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సర్పంచులకు సంతోషం

విశాలాంధ్ర-నక్కపల్లి : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వల్ల రాష్ట్రములో గ్రామ సర్పంచ్లు ఎంతో ఆనందంగా ఉన్నారని గ్రామాల అభివృద్ధికి ఒక ప్రత్యేక ప్రణాళికను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని త్వరలో దీపావళికి కానుకగా మూడు సిలిండర్లు అందించడం జరుగుతుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చినదొడ్డిగల్లు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి కృషి చేస్తానని గత ప్రభుత్వంలో సర్పంచులు చాలా ఇబ్బందులు పడ్డారని కానీ ఈ ఎన్ డి ఏ ప్రభుత్వంలో సర్పంచులు సంతోషంగా ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వములో పంచాయతీలను నిర్వీర్యం చేశారని నిధులు పక్కదోవ పట్టించారని ఈ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళ్యాణ్ గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఆర్ అండ్ బి రోడ్లు పూర్తవుతాయని తెలిపారు. వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు సకాలంలో పింఛనులు పంపిణీ చేసే ఘనత కూటమి ప్రభుత్వానికి చెందిందని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల్లో భాగంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసామని సంవత్సరానికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని తెలిపారు. మండలంలో ఉద్దండ పురం వాటర్ ప్రాజెక్ట్ గత ప్రభుత్వం పట్టించుకోలేదని త్వరలోనే వాటర్ ట్యాంక్ ప్రాజెక్ట్ పనులు పూర్తిచేసి నియోజకవర్గానికి త్రాగునీరు అందిస్తామని తెలిపారు. గ్రామాల్లో స్మశానవాటికలపై దృష్టి పెడతామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అన్నారు. ఈ మేరకు చినదొడ్డిగల్లు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ను జనసేన టిడిపి నాయకులు అట్టహాసంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణ న్ ఆర్డిఓ వివి రమణ తహసిల్దార్ నరసింహమూర్తి ఎంపీడీవో దెందుకూరు సీతారామరాజు రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ బోడపాటి శివ దత్త టిడిపి నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్ వైబోయిన రమణ వెలగా శ్రీనివాస్ కురందాసు నూకరాజు కొప్పిశెట్టి బుజ్జి జనసేన నాయకులు సుధాకర్ తదితరులున్నారు

చూచుకొండ పాల సంఘం వద్ద రైతుల నిరసన

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో చూచుకొండ గ్రామంలో పాల సంఘం వద్ద పాడి రైతులు నిరసన వ్యక్తం చేశారు. విశాఖ డెయిరీ ఆవు పాలు ధర ఒకసారే నాలుగు రూపాయలు తగ్గించడంతో పాడి రైతులు ఆగ్రహానికి లోనయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో దానా రేటు 750 రూపాయలు ఉండేదని అదనంగా 250 రూపాయలు పెంచారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దానా రేటు తగ్గించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం బోనస్ రెండుసార్లు ఇచ్చేవారని ఇప్పుడు ఒక్కసారికే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆవుపాలు రేటు పెంచాలని దానా రేటు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం డైరెక్టర్ కాండ్రేగుల చిన్న, పాడి రైతులు కాండ్రేగుల చంద్ర రావు, బొడ్డేడ నర్సింగరావు, కోరుబిల్లి నాగేశ్వరరావు, కాండ్రేగుల వెంకటి, పెంటకోట రఘురాం, కాండ్రేగుల శివ, పెంటకోట చిన్నునాయుడు, కాండ్రేగుల రాజు నాయుడు, చదరం వరా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్లకు మహర్దశ

టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

విశాలాంధ్ర-పాయకరావుపేట: కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాలలో రోడ్లకు మహర్దశ కలుగుతుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టి బాబు అన్నారు. మండలంలోని మాసా హెబ్ పేట, సత్యవరం, గోపాలపట్నం గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. మాసాహెబ్ పేట గ్రామంలో రూ. 10 లక్షలతో, సత్యవరం గ్రామంలో రూ. 16 లక్షలతో, గోపాలపట్నం గ్రామంలో రూ. 9 లక్షలతో నిర్మించే రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి శ్రీరాములు, కీర్తి సీతారాం, పల్లా విలియం కేరి, కట్టా శ్రీను, వేములపూడి అప్పారావు, ఎంపీడీవో జయప్రకాశరావు, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, పంచాయతి రాజ్ ఏఈ కచేరి, ఏపీవో హేమలత, పంచాయతీ కార్యదర్శి వై. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలలో పలు రహదారులకు ఎమ్మెల్యే రాజు శంఖుస్థాపనలు

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం మండలంలో శనివారం నిర్వహించిన పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పలు పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రహదారులు ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్ ఎన్.ఎస్ రాజు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో అన్ని గ్రామాలు అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. శేమునాపల్లి పంచాయతీలో రూ 20 లక్షలు తో కాంక్రీట్ రోడ్డు, అడ్డూరు లో రూ 8.30 లక్షలు కాంక్రీట్ రోడ్డు, గంధవరం లో రూ.3 లక్షలు తో కాంక్రీట్ రోడ్డు, అంభేరుపురం, రాయపురాజు పేట, భోగాపురం, వెంకన్నపాలెం పంచాయతీల్లో కాంక్రీట్ రోడ్లు నిర్మాణానికి శంఖుస్థావన లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ ఆంజనేయులు, ఈ.ఓ.ఆర్డీ ఓ.మహేష్, పంచాయతీరాజ్, ఎన్.ఆర్.జి.ఎస్. పి.ఓ, పంచాయతీ రాజ్ ఈ ఈ లు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోడా కోటేశ్వరరావు పై సస్పెండ్ ఎత్తి వేయలేదు

విశాలాంధ్ర-పాయకరావుపేట: సర్పంచి పదవిని అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడిన మండలంలోని పాల్మాన్ పేట కు చెందిన కోడా కోటేశ్వరరావు పై సస్పెండ్ ఇంకా కొనసాగుతూనే ఉందని, సస్పెండ్ ఎత్తివేసినట్లుగా తమకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని స్థానిక అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా, సర్పంచి పదవిని దుర్వినియోగం చేస్తూ కోడా కోటేశ్వరరావు సాల్వెన్సీలు ఇవ్వడంతో గ్రామానికి చెందిన మైలపల్లి అశోక్ చక్రవర్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం 3 నెలల పాటు సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీష రాణి గత నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై కోడా కోటేశ్వరరావు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. డిపిఓ సస్పెండ్ ఆర్డర్ ను కోర్టులో కొట్టివేశారని కోటేశ్వరరావు చెబుతున్నప్పటికీ జిల్లా అధికారుల నుంచి తమకు ఎటువంటి ఉత్తర్వులు జారీ కాలేదని స్థానిక అధికారులు తెలిపారు.

ధర్మవరం గ్రామంలో స్వచ్ఛత హీ కార్యక్రమం

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో ధర్మవరం గ్రామం లో స్వచ్ఛత హీ కార్యక్రమం నిర్వహించారు. శనివారం గ్రామం లోని ఊరు శివారులో ఉన్న కాలువ వద్ద రోడ్డుపైన చెత్త తొలగించడం జరిగింది. మండల ప్రత్యేక అధికారి ఎస్ వి ఎస్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు అక్కడ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది బ్లీచింగు సున్నం వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఉపసర్పంచ్ కలిగట్ల మాణిక్యం, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ : ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర -మాడుగుల: గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ కార్యక్రమాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం మాడుగుల మండలం గాదిరాయి, ఒమ్మలి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాలకు హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననల పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎంపిపి పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ రాయపురెడ్డి కృష్ణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉండూరు దేవుడు, గాదిరాయి సర్పంచ్ జగన్నాథరావు, ఒమ్మలి సర్పంచ్ సుంకర సింహాచలం నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పల రమేష్, శ్రీనివాసరావు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జగన్ కు శాశ్వత ప్రతిపక్షమే!

బుద్ధ నాగ జగదీశ్వరరావు

విశాలాంధ్ర-అనకాపల్లి: జగన్ రెడ్డి గత ఐదు సంవత్సరాలలో అబద్ధాలు చెబుతూ మోసాలు చేయడం ప్రభుత్వ ధనంతో సోకులు చేసుకోవడం తన సొంత ఇంటికి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి అధికార దుర్వినియోగం చేసిన విషయం మరిచిపోయారు కాబట్టే ప్రజలు 11 స్థానాలకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదా లేకుండా ప్రతిపక్ష పార్టీ గానే ప్రజలు జగన్ రెడ్డికి స్థానం కల్పించారని మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. ప్రజాధనాన్ని వేల కోట్లు దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులను తీసుకువచ్చి గనులు శాఖలో వెంకట్ రెడ్డిని ఎక్సైజ్ శాఖలో వాసుదేవరెడ్డిని తమ సామాజిక వర్గ అధికారులను నియమించుకొని డీపీటీ చేశారని , నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వాసుదేవరెడ్డిని యలహంక ప్యాలెస్ లో నేరస్తులను దాచడం,అవినీతి అక్రమ ఆర్థిక నేరాలు చేసి 11 సిబిఐ కేసులు 7 ఈడి కేసుల్లో ముద్దాయిగా ఉన్న జగన్ రెడ్డికి ఉచిత ఇసుక, మద్యం గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని నాగ జగదీష్ జగన్ రెడ్డిని ప్రశ్నించారు. స్కిల్ కేసులో సీమెన్ కంపెనీ వారిపై ఈడి కేసు జీఎస్టీ విషయంలో వారు ఆస్తులు పై అటాచ్ చేశారని దీనిలో చంద్రబాబు ప్రమేయం లేదని స్పష్టంగా చెప్పినప్పటికీ, నాడు వైసీపీ ప్రభుత్వంలో తాము పెట్టిన కేసులు కాబట్టి చంద్రబాబు అబద్ధ ప్రచారాలు చేసుకుంటున్నారని జగన్ చెప్పడం వింతగా ఉందని ఎదురుదాడికి దిగుతున్నారని నాగ జగదీష్ అన్నారు. తనపై ఉన్న అవినీతి అక్రమ ఆర్థిక కేసుల విషయంలో కోర్టుకు వెళ్లకుండా, అలాగే కోడి కత్తి విషయంలో, గులకరాయి కేసులో, వాస్తవాలు బయటపడతాయని నిర్దోషులకు జైల్లో అన్యాయంగా శిక్షలు అనుభవించారని, కోర్టులో ఉన్న లసుగులను వినియోగించుకొని, గత 12 సంవత్సరాలుగా కోర్టులకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్న జగన్ రెడ్డికి చట్టంపై విశ్వాసం లేదని, నిర్దోషిగా నిరూపించుకునే సత్తా లేదని నాగ జగదీశ్ ఎద్దేవా చేశారు. కరకట్టపై చంద్రబాబు ఇల్లును ముంచాలని విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రకాశం బ్యారేజ్ ని ధ్వంసం చేసే కుట్ర చేశారని, కూటమి ప్రభుత్వంపై కలియుగ వెంకటేశ్వర స్వామి, కనకదుర్గమ్మ ఆశీస్సులు ఉన్నాయని కాబట్టి ప్రజలకి అంత పకృతి విపత్తు జరిగిన ఎటువంటి ఆపద జరగలేదని, అదే జగన్ రెడ్డి చిన్నపాటి వర్షానికి యలహంక లో తన ప్యాలెస్ మునిగిపోయిందని దేవుని స్క్రిప్ట్ అమలైందని, జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన చంద్రబాబు ఇచ్చిన హామీలపై ప్రజలకు విశ్వాసం ఉందని వచ్చే సంవత్సరంలో పూర్తిస్థాయిలో సూపర్ సిక్స్ అమలు అవుతాయని ఇప్పటికే రెండు హామీలు మెగా డీఎస్సీ 16,816 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని డిసెంబర్ లో పరీక్షలు నిర్వహణకు చర్యలు తీసుకున్నారని, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ పథకం దీపావళి నుండి అమలు అవుతుందని ఇవి జగన్ కి కనబడకపోవడం విచిత్రంగా ఉందని నాగ జగదీష్ మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని దశల వారీగా అమలు జరుగుతున్నాయని జగన్ రెడ్డి మీ అబద్ధపు మాటలు ప్రచారాలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఇక మీకు శాశ్వతంగా ప్రతిపక్ష పార్టీ గానే మిగిలిపోతారని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ చైర్పర్సన్ రమాకుమారి

విశాలాంధ్ర -యలమంచిలి: పురపాలక సంఘంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ-2024 కొనసాగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ చైర్పర్సన్ పిల్ల రమాకుమారి, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్రారాజు ఆధ్వర్యంలో స్థానిక టిట్కో హౌసింగ్ (రాంనగర్) నందు మాస్ క్లీన్లీనెస్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా తుప్పలను చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ పిల్ల రమాకుమారితో పాటు మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

146 కేజీల గంజాయి స్వాధీనం, ఇద్దరు అరెస్టు

విశాలాంధ్ర నక్కపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ (ఏవోబీ) ప్రాంతం నుంచి ఒక కారులో 146 కేజీల గంజాయిని తరలిస్తుండగా శనివారం ఉదయం వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద సీఐ కు మారస్వామి సిబ్బందితో తనిఖీలు జరిపి పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ చెప్పిన వివరాలివి. మహ రాష్ట్రకు చెందిన రామేశ్వర్ చౌహాన్, రాబిన్ అనే వ్యక్తులు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకురావాలని మోమిన్ రీస్ జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవ్లను పురమాయించారు. దీంతో ఈ ఇద్దరు కారులో ఈ నెల11న జులా, జయదేవ్ లు విశాఖ చేరుకున్నారు. 15న రామేశ్వర్ చౌహాన్, రాబిన్ లలు కూడా విశాఖ చేరుకున్నారు. శనివారం ఉదయం మోమిన్ రీస్ జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవ్ కారులో 146 కేజీల గంజాయిని ముంచింగ్‌పుట్ సమీపాన కొనుగోలు చేసి కారులో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు తీసుకెళ్తుండగా, వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నామని సీఐ చెప్పారు. రెండేసీ కేజీల గంజాయి ప్యాకెట్లు 73 వున్నాయని, సుమారు రూ.4.38 లక్షలు విలువైన 146 కేజీల గంజాయిన స్వాధీనపర్చుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ఇదే కేసులో మధ్యవర్తులుగా వున్న రామేశ్వర్ చౌహాన్, రాబిన్ ల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

అవంతి కళాశాలలో నూతన విద్యార్థుల ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-నర్సీపట్నం(మాకవరపాలెం): మాకవరపాలెం అవంతి కళాశాలలో శనివారం ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు ఆప్యాయంగా ఆహ్వానం పలుకుతూ ఒక సమావేశం (ఇండక్షన్ మీట్) ఏర్పాటు చేశారు. అవంతి విద్యా సంస్థలు చైర్మన్, మాజీ పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి, ముఖ్య అతిథిగా జె ఎన్ టీ యు , విజయనగరం రిజిస్ట్రార్, ప్రొఫెసర్ జి.జయ సుమ, గౌరవ అతిథిగా విశాఖపట్టణం ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డా. అబ్రహం వర్గేశ్ మరియు ప్రత్యేక అతిథులుగా విశాఖపట్టణం 13వ, ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్ కుమార్, క్వింతే టెక్నాలజీ మానవవనరుల శాఖాధికారి సురేష్ కుమార్ హాజరయ్యారు, ఈ సమావేశాన్ని ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థినుల ప్రార్థనా గీతంతో ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథి జె ఎన్ టీ యు విజయనగరం రిజిస్ట్రార్, ప్రొఫెసర్ జి.జయ సుమ మాట్లాడుతూ. ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఇంజనీరింగ్ విభాగాలలో విషయాలు పొందు పరిచారని, ప్రస్తుతం పెరుగుతున్న కంప్యూటర్ సాంకేతికతను అనుసరించి అన్ని ఇంజనీరింగ్ విభాగాలలో వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందుపరిచారని తెలిపారు. అదే విధంగా విజ్ఞానాన్ని మెరుగు పరుచు కొనుటకు చాలా మార్గాలున్నాయని మనం చేయవలసిందల్లా అంకితభావం తో చదవాలని, ఇంజనీరింగ్ డిగ్రీ తో పాటు ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవాలని అందుకుగాను ఎన్ పి టీ ఎల్ కోర్సులు పూర్తి చేయాలని కోరారు. అలాగే 8 గంటలు విద్య అభ్యసన, 8 గంటలు నిద్ర, 8 గంటలు మిమ్మల్ని మీరు మెరుగు పరుచు కోవడం- 8/8/8 పద్ధతిని అనుసరించాలని సూచించారు.అవంతి విద్యా సంస్థలు చైర్మన్, మాజీ పర్యాటక శాఖ మంత్రి వర్యులు, శాసనసభ్యులు, శ్రీ ముత్తం శెట్టి శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పోటీపడుతున్నారని, అలాగే మన విజ్ఞానం మన అభివృద్ధికె కాకుండా దేశాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలని కోరారు. ప్రతీ ఒక్కరికీ వ్యక్తిత్వం ముఖ్యమని, ఏది కోల్పోయిన సంపాదించు కోవచ్చు కానీ వ్యక్తిత్వం కోల్పోతే సంపాదించు కోలేమని స్వామి వివేకానంద గారి మాటలను గుర్తుచేశారు యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. గౌరవ అతిథిగా విశాఖపట్టణం ఎన్ ఎస్ టీ ఎల్ డైరెక్టర్ డా. అబ్రహం వర్గేశ్ గారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ అంటే ఆక డిగ్రీ కాదని ఇంజనీరింగ్ విజ్ఞానం మన దేశం సంకేతికత లో అభివృద్ధిని చూచిస్తుందని, ప్రతి ఒక్క విద్యార్థి వినూత్నంగా ఆలోచించాలని అందుకుగాను వివిధ మార్గాల ద్వారా జ్ఞానాన్ని పొందాలని ఆఉచించారు. అలాగే టీమ్ వర్క్ తో పనిచేయడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కొత్త విషయాలు నేర్చుకోవడం నిరారంత ప్రక్రియ అలా కానప్పుడు ఉత్తమ పలితలను సాదించలేమని తెలిపారు. విశాఖపట్టణం 13వ, ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్ కుమార్ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, మనల్ని మనం నియంత్రించు కోవడం మీద మన భవిష్యత్తు ఆధారపడి ఉంటున్నది, చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకొని అవి సాధించడం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగి విజయాలను అందుకోవచని సూచించారు. క్వింట్ టెక్నాలజీ మానవవనరుల శాఖాధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ నైపుణ్యం, విజ్ఞానం మరియు చేసే పనిలో అనుభవం మంచి ఫలితాలు మెట్లు, మన భవిష్యత్తు మన చేతులలోనే ఉంది అలాగే మనం విషయ విజ్ఞానం, ఆచరణ విజ్ఞానం అభివృద్ధి చేసుకోవడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చు అన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రాంబిల్లి: పల్లెల అభివృద్ధే లక్ష్యంగా 'పల్లె పండుగ' కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు యలమం చిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. శనివారం నాడు మండలంలో పలు గ్రామాల్లో జరిగిన పల్లె పండుగలలో భాగంగా సిసి రోడ్లు,కాలువల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేస్తే కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో తమ ప్రభుత్వంతో గ్రామాలకు మహర్దశ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్ లు,వార్డు సభ్యులు, టీడీపీ, జనసేన మండల పార్టీల అధ్యక్షులు వసంతవాడ దిన్ బాబు,పప్పల నూకన్న దొర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగ నాయకులు,గ్రామ సచివాలయాల సిబ్బంది, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో శివుని విగ్రహం ఆవిష్కరణ

విశాలాంధ్ర-కశింకోట: మండలంలోని తాళ్లపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న హిందూ శ్మశాన వాటికలో శివుని విగ్రహాన్ని శనివారం ఆవిష్కరణ చేశారు. గుమ్మడి మనోజ్ కుమార్ జయంతి పురస్కరించుకుని, గుమ్మడి సురేష్ కుమార్, గుమ్మడి మనోజ్ కుమార్ జ్ఞాపకార్థం వారి తాతయ్య గుమ్మడి సూర్యనారాయణ, కుటుంబ సభ్యులు సహకారంతో విగ్రహం ఏర్పాటు చేశారు. అచ్యుతాపురం వికలాంగుల ఆశ్రమం,కొండకర్ల ఆశ్రమంలో ప్రతి నెల ఒక్క రోజు భోజనం ఏర్పాటు చేస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సహకార రైతులకు డివిడెండ్ పంపిణీ

విశాలాంధ్ర-మునగపాక: దసరా,దీపావళి పండుగలను పురస్కరించుకుని రైతులకు డివిడెండ్ పంపిణీ చేయనున్నట్లు సహకార సొసైటీ సీఈవో ఆడారి వేణుగోపాల్ (కృష్ణ) తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి గాను ఏ గ్రేడ్ సభ్యులు 3656 మందికి 15 శాతం డివిడెండ్ 4.82 లక్షలు పంపిణీ జరుగుతుందని తెలిపారు. రికార్డ్ స్థాయిలో 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి 33.79 కోట్ల రూపాయలు డిపాజిట్ సేకరణ జరుగగా, 19.59 కోట్ల రూపాయలు రుణాలు గా అందించడం జరిగిందన్నారు. లావాదేవీలపై 24.83 లక్షలు నికర లాభం వచ్చిందని చెప్పారు.

అదికారులు సమన్వయంతో పనిచేయాలి

విశాలంధ్ర-అచ్యుతాపురం : మండలంలో ఏపీఐసీ కార్యాలయంలో సుందరపు విజయ్ కుమార్ బదిలీలపై వచ్చిన అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి నియోజవర్గం అభివృద్ధికి అధికారులందరూ కృషి చేయాలన్నారు. నాలుగు రోడ్ల జంక్షన్ లో డ్రైనేజీలు ఎలక్ట్రికల్ రోడ్డు విస్తీర్ణ సంబంధించిన పనులు పరిశీలించారు . అన్ని శాఖలపై సమగ్ర నివేదిక అందించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు . ఈ కార్యక్రమంలో ఉన్నత అధికారులు తదిరులు పాల్గొన్నారు

నర్సీపట్నం మున్సిపాలిటీ ఐదు సంవత్సరాల కాలంగా అభివృద్ధి కుంటుపడింది

విశాలాంధ్ర-నర్సీపట్నం : కూటమి ప్రభుత్వం గెలిచిన మూడు నెలల కాలంలో మున్సిపాలిటీకి సుమారు 5 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు వర్క్ ఆర్డర్లు వచ్చినట్లు ప్రకటించామని చెప్పడం గర్వంగా ఉందని కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తెచ్చుకోలేకపోయామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో వార్డుల్లో వీధి లైట్లు వెలగని పరిస్థితి ఉండగా, మూడు నెలల కాలంలో ప్రతి వార్డులో వీధి లైట్లు వెలుగుతున్నాయని అన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు గారు పార్టీలకు అతీతంగా ప్రతి వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నారని కౌన్సిలర్ పద్మావతి చెప్పారు. గత ఐదు సంవత్సరాలుగా పుష్కాట్లు మరమ్మతులు పొందకపోవడంతో చెత్తను తీసుకువెళ్లడంలో సానిటరీ కార్మికులు ఇబ్బందులు పడినట్లు తెలిపారు. ఆ విషయం స్పీకర్ దృష్టికి వెళ్లిన వెంటనే కమిషనర్‌తో మాట్లాడి వాటికి మరమ్మతులు చేయించారని చెప్పారు. శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీ కార్యాలయంలో పుష్కాట్లకు ఉండే డస్ట్ బిన్లు సచివాలయం సానిటరీ విభాగం వారికి స్పీకర్ సతీమణి చింతకాయల పద్మావతి, మున్సిపల్ చైర్మన్ సుబ్బలక్ష్మి, కౌన్సిలర్ల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర, శానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, వార్డు కౌన్సిలర్లు ధనమిరెడ్డి మధు, రాజుల నాయుడు, డబ్బీర్ శ్రీకాంత్, పైలా గోవిందు, రుత్తల కృష్ణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొలువు దీరిన గౌరీ పరమేశ్వరులు



విశాలాంధ్ర-యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలో కొత్తపాలెం గ్రామంలో శ్రీ గౌరీ పరమేశ్వరులు, కార్తీక మాసంలో పూజలు అందుకునేందుకు శనివారం నాడు కొలువు తీరారు. పౌర్ణమి రోజు సాయంత్రం గ్రామస్తులంతా ఊరేగింపుగా వెళ్లి గౌరీ దుబ్బును తీసుకొచ్చి గౌరీ పరమేశ్వరులను నిలపడం ఇక్కడ ఆనవాయితీ. ఈరోజు మొదలుకొని కార్తీకమాసం అంతా ప్రత్యేక పూజలు ఆచరించడం, దీపావళి, కార్తీక పౌర్ణమి రోజున వివిధ ఆకారాల్లో దీపాలంకరణలు గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో చేయడంతో పండగ వాతావరణం సంతరించుకుంటుంది. కార్తీకమాసం చివరి శనివారం గ్రామస్తులంతా ప్రతి ఇంటి నుండి పిండి వంటలు చేసుకుని సామూహికంగా ఊరంతా తిరిగి అందర్నీ కలుపుకుంటూ గౌరీ పరమేశ్వరులకు పసుపు, కుంకుమ, చీర, రవిక సమర్పించి, ప్రతి ఇంటి నుండి తెచ్చిన పిండి వంటలు సారిగా అమ్మవారికి సమర్పించడం, అనంతరం భారీగా గౌరీ పరమేశ్వ రులను గ్రామం అంతా ఊరేగిస్తూ పలు సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ ఆడారి భాస్కర్, గ్రామ పెద్దలు దాడి కృష్ణ, ఏ వి రెడ్డి నాయుడు, ఆడారి అప్పారావు, పూజారి మనీ దేవాలయ కమిటీ వారు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపడానికి సిద్ధ పడటం అన్యాయం : సీపీఎం

విశాలాంధ్ర-రాంబిల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, పేదలకు 200 యూనిట్లు వరకు ఉచితంగా ఇస్తామని నమ్మించి, నేడు విద్యుత్ బారాలు మోపడానికి సిద్ధం అవ్వడం అంటే ఇంతకంటే మోసం మరొకటి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రమైన రాంబిల్లిలో శనివారం నాడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ బారాలు రూ. 8114 కోట్ల ట్రూ ఆఫ్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు పేరుతో పెంచాలనుకున్న విద్యుత్ బారాలను వెనక్కి తీసుకోవాలని,ఆ భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేస్తూ, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కన్వీనర్ జి దేముడు నాయుడు మాట్లాడుతూ గత వైయస్సార్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు, బాదుడే బాదుడు కార్యక్రమాలు పెట్టిన టిడిపి నాయకులు, వీరు అధికారంలోనికి వచ్చాక జగన్ బాటలోనే నడుస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ రామకృష్ణ, డి కాశియా, వై రాము, కే లక్ష్మి, బి శ్రీనివాస్, చోడిపిల్లి గంగరాజు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ చార్జీలు తగ్గించాలని నిరసన..

విశాలాంధ్ర -మాడుగుల: ఇటీవల కాలంలో నూతన విద్యుత్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చి అదిక కరెంట్ చార్జీల పేరుతో వసూలు చేస్తుందని మాడుగుల సిపిఎం మండల కార్యదర్శి ఇ.నరసింహమూర్తి, మండల నాయకురాలు భవాని అన్నారు. ఈ మేరకు మాడుగులలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉండేటటువంటి ప్రజలందరికీ గతంలో వాడుకున్న విద్యుత్ నేడు బిల్లులు కట్టించుకునే విధానం మానుకోవాలన్నారు. విద్యుత్ చార్జీల్లో ఇందన సర్దుబాటు ట్రూ ఆఫ్ చార్జీలు సెస్సులు వెంటనే రద్దు చేయాలన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టాలు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన వ్యతిరేకించాయని, కానీ నేడు అధికారంలోకి వచ్చి అదే విధంగా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును సిపిఎం ఖండిస్తుందన్నారు. ప్రజలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఈ విధానాల అమలు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమం లో బుసరి మల్లుదొర, బచ్చల ఈశ్వరావు, కొర్రా నాగార్జున, విజయశాంతి, అచ్చిబాబు, చిన్నారావు, బాలకృష్ణ, సన్యాసిరావు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతో గ్రామాల అభివృద్ధి

- హోం మంత్రి వంగలపూడి అనిత
- టిడిపిలో చేరిన సర్పంచ్ షేక్ మున్నీషా

విశాలాంధ్ర-నక్కపల్లి : కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఎప్పుడు అండగా ఉంటుందని వారి సంక్షేమానికి కృషి చేస్తుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శనివారం పెదబొడుగల్లం గ్రామంలో గ్యార్వి షరీఫ్ ఉర్స్ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ముందుగా పెదబొదిగల్లం ముస్లిం సోదర సోదరీమణులకు గ్యార్వి షరీఫ్ ఉర్స్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఈ గ్రామాన్ని పట్టించుకోలేదని అన్నారు. ఈ గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని అందుకోసం 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామ అభివృద్ధి నిధులు కోసం ఎమ్మెల్యేలు ఎంపీలు చుట్టూ తిరిగే వారిని ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు ఎంపీలు చుట్టూ తిరగకుండా నిధులు మీ ఇంటికి వస్తాయని అన్నారు. జనసేన అధ్యక్షుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సినిమాల్లో కాదని రాజకీయాల్లో కూడా రికార్డు సృష్టిస్తారని అటువంటి వ్యక్తి ఈ రాష్ట్రంలో ఉండడం మనందరి అదృష్టమని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందని ఈ ప్రాంతంలో ఎటువంటి సమస్య వచ్చినా మంత్రిగా తెలియపరచాలని అన్నారు. అనంతరం పెదబొదిగల్లం వైసిపి సర్పంచ్ షేక్ మున్నీసా మరి కొంతమంది గ్రామస్తులు హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్పంచ్ షేక్ మున్నీసా కు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గబ్బాడ లో ప్రభుత్వ ఇసుక డిపో

ఆన్లైన్, మాన్యువల్ లో బుకింగ్
కలెక్టర్ విజయ్ కృష్ణన్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జిల్లాలోని నర్సీపట్నం మండలం గబ్బాడ లో ఇసుక డిపోకు సంబంధించి ఇసుక బుకింగ్ ఆన్లైన్లో sand.ap.gov.in ద్వారా లేదా మాన్యువల్గా బుకింగ్ చేసుకోగలరని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ తో జరిగిన సమావేశంలో ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానానికి సంబంధించి, గబ్బాడ ఇసుక డిపో ఆన్లైన్ విధానం ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇసుక ధరను రూ.1165/-గా 'జిల్లా ఇసుక స్థాయి కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ఏ విధమైన 4వస్థాయి 5వస్థాయి నదులు ప్రవహించటం లేదు. ఈ జిల్లాలో వాగులు, వంకలు, చిన్న నదులు 2, 3వ స్థాయి అనగా సర్పానది, శారదా నది, తాండవా నది వరాహ నదులు మాత్రమే ఉండటం వలన ఇసుక లభ్యత కోసం దూర ప్రాంతాలైన శ్రీకాకుళం, తూర్పుగోదావరి డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గల నది ప్రాంతంలో ఉన్న ఇసుక రీచ్ లపై ఆధారపడవలసి వస్తుందన్నారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం వద్ద గబ్బాడ ఇసుక డిపోలో సుమారు 48,204 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు.

నూతన ఉచిత ఇసుక విధానం-2024 ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఏ విధమైన అదనపు ప్రభుత్వ రుసుములు వసూలు చేయకుండా అందరికి ఇసుక అందుబాటులో ఉంచడం కోసం కేవలం నదీ ప్రాంతంలో త్రవ్వకం నకు అయిన ఖర్చు ఇసుక రవాణా ఛార్జీలు, డిపో యందు ఇసుక లోడింగ్ ఖర్చులు మాత్రమే వినియోగదారు నుండి వసూలు చేసి వారికి ఇసుకను లభ్యమయ్యే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జిల్లా స్థాయి ఇసుక కమిటి, ప్రభుత్వం వారు ప్రవేశ పెట్టిన నూతన ఉచిత ఇసుక విధానంలో పేర్కొన్న అంశాలను అనుసరిస్తూ 1 మెట్రిక్ టన్ను ఇసుక, డిపోలో లోడింగ్ తో కలిపి రూ.1,165/- లుగా నిర్ణయించుట తెలిపారు.

ఇసుకను ఆన్-లైన్ ద్వారా పొందు విదానము...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నిర్వహిస్తున్న www.sand.ap.gov.in వెబ్ పోర్టల్ ద్వారా, ఇసుకను పొందకోరు వారు sand portal నందు ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్ ద్వారా ఇసుక పోర్టల్ నందు రిజిష్టర్ కాబడి, తదుపరి User name, Password ద్వారా తమకు కావలసిన ఇసుకను ఆన్-లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవాలన్నారు. ఇసుకను బుకింగ్ సమయంలో సొంతః వాహనము లేదా ప్రభుత్వం వారుచే ఏర్పాటు చేయబడిన వాహనములో మీరు ఎంపిక చేసుకోవచ్చన్నారు.ప్రభుత్వ వాహనం ఉపయోగించినపక్షంలో, మీరు పొందబోయే ఇసుక పరిమాణం మీ ఇంటి వరకు ఉన్న ప్రయాణ దూరాన్ని ఆధారంగా తీసుకుని, రవాణా చార్జీలను లెక్కించి మొత్తం చెల్లించవలసిన రూపాయలు చూపించబడతాయి. మీరు '%ాఖ%' బటన్ నొక్కి ఆమోదించిన తర్వాత, మీ ఆర్డర్ కంఫర్మ్ అవుతుంది. ఆ తర్వాత, సుమారు 2 లేదా 3 రోజుల్లో, ఆర్డర్ చేసిన ఇసుక మీ ఇంటికి రవాణా చేయబడుతుందని తెలిపారు. పైన తెలుపబడిన ఆన్-లైన్ విధానంలోనే కాకుండా ఇసుక వినియోగదారులు పైన పేర్కొన్న గబ్బాడ ఇసుక బుకింగ్ సెంటర్లోని కోఆర్డినేటర్ను సంప్రదించి ఆధార్, మొబైలు , ఇసుక చెరవేయవలసిన గమ్యస్థానము తెలిపిన పిదప డిజిటల్ అసిస్టెంట్ వారు తమకు కావలసిన ఇసుకను ఆన్-లైన్ ద్వారా బుకింగ్ చేస్తారు. ఇసుక వినియోగదారులు నిర్ణీత మొత్తం డిజిటల్ మోడ్లో మాత్రమే డబ్బులను చెల్లించవలెను. నగదు లావాదేవీలు అనుమతించబడవు. నిర్ణీత మొత్తమును చెల్లించిన తరువాత డిజిటల్ అసిస్టెంట్ వారు ఇన్వాయిస్ను అందజేయుదురు. ఇన్వాయిస్ నందు వినియోగదారు మొబైల్ నంబర్, ట్రక్/వాహనం నంబర్, కార్యకలాపాల ఖర్చు, రవాణా ధరలు మరియు డెలివరీ స్లాట్ వివరాలు ఉంటాయి. ఇసుక వినియోగదారులు ఇన్వాయిస్ లో పేర్కొన్న డెలివరీ స్లాట్ సమయమునకు ఇసుక స్టాక్ యార్డ్ వద్ద ఇసుక లోడింగ్ చేసుకొనవచ్చును. ఇన్వాయిస్లను బుక్ చేయని నిర్దిష్ట రోజున లిఫ్టింగ్ కోసం షెడ్యూల్ చేయని వాహనాలు రీచ్/స్టాక్యార్డ్ను సందర్శించడానికి అనుమతి లేదన్నారు.చెల్లుబాటు అయ్యే ఇన్వాయిస్లు ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించడానికి అన్ని సరఫరా పాయింట్ల వద్ద చెక్ పోస్టను నిర్వహించడానికి అవసరమైన పోలీసు సిబ్బందిని నీ జిల్లా ఎస్పీ నియమిస్తారు వారు సరఫరా పాయింట్ల వద్ద ఎలాంటి రద్దీని లేకుండా చూస్తారని తెలిపారు.

పాల సేకరణ ధర తగ్గింపు పై భగ్గుమన్న పాడి రైతులు

విశాలాంధ్ర-చోడవరం : పాలు సేకరణ ధర తగ్గించడాన్ని నిరసిస్తూ మండలంలోని నరసయ్యపేట పాల కేంద్రం వద్ద శనివారం పాడి రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ రోజురోజుకు పశుగ్రాసం ధరలు, కూలీ రేట్లు పెరిగిపోయి పాడి పరిశ్రమ నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. ఈ క్రమంలో పాల సేకరణ ధరను పెంచాలి కానే, పాలు సేకరణ ధర తగ్గించడం వల్ల పాడి రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. పాల సేకరణ ధరను గతంలో మాదిరిగానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో నరసయ్యపేట పాడి రైతులు పాల్గొన్నారు

పల్లె పండుగతో అభివృద్ధి కార్యక్రమాలు

విశాలాంద్ర-గరివిడి: రోడ్లు, కాలువలు,ఇతర అభివృద్ధి కార్య క్రమాలతో ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి పల్లె పండగను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. శనివారం సాయంత్రం కోడూరు పరిధిలోని వైయస్సార్ కాలనీలో 24 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టనున్న సిసి రోడ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఏపీ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పైల బలరాం, సురేష్, ఎంపీపీ మీసాలు విశ్వేశ్వరరావు, జనసేన పార్టీ చీపురుపల్లి ప్రతినిధి శ్రీనివాసరావు, కోడూరు,కొండ పాలెం, టిడిపి నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. దువ్వాం, తాటిగూడ, ఏనుగువలస, వెదుల్లవలస గ్రామాలలో పళ్ళు పండుగ కార్యక్రమాలు నిర్వహించారు.